ప్రజాశక్తి

బుధవారం 24 మే 2023 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- సిసి కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు
- పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు నిషేధం
- ఆర్‌ఐఒ సైమన్ విక్టర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. సప్లిమెంటరీ పరీక్ష నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిసి కెమెరాల నిఘాలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్‌ఐఒ) ఏ.సైమన్ విక్టర్ తెలియజేశారు. పరీక్షలు ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు.



ఆర్‌ఐఒ సైమన్ విక్టర్

పరీక్షలకు 32,231 మంది విద్యార్థులు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 32,231 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 21,219, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11,012 మంది హాజరు కానున్నారు. పరీక్షలను 72 పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తున్నాం. వీటిలో కంభం, పెద్దదోర్నాల, అర్ధవీడు, ఎర్రగొండపాలెం లోని కళాశాలను సున్నితమైనవిగా గుర్తించి ఈ నాలుగు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పరీక్షల నిర్వహణ కోసం 72 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 72 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 628 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. పరీక్షల్లో కాపీయింగ్ నిరోధించేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశాం. వీరికి తోడు డిఏసి సభ్యులు, జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులు, రాష్ట్రస్థాయి బోర్డు అధికారులు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరికీ ప్రైవేట్ కార్పొరేట్ ▶ 2లో

అభివృద్ధి జాడేదీ..?

- నాలుగేళ్లలో చెప్పుకోవడానికి ఒక్కటీ లేదు.!
- ఒక్క ప్రాజెక్టు కూడా కార్యరూపం దాల్చని వైనం
- దొనకొండ, కనిగిరి సెజ్‌లు, సోలార్ ప్రాజెక్టులు అన్నీ ఎండమావులే..
- విభజన చట్టంలో ప్రస్తావించిన కేంద్ర సంస్థలూ జాడలేని దైన్యం
- వెలిగొండ ప్రాజెక్టూ నాలుగేళ్లుగా కొనసాగుతున్న పరిస్థితి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లవుతోంది. కాలం గడిచిపోయింది. జిల్లాలో ఏం జరిగిందనేది చూసుకుంటే లబ్ధిదారులుగా గుర్తించబడిన జనానికి కొన్ని సంక్షేమ పథకాల ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి నగదు పడింది. ఒక్కో కుటుంబానికి ఎంత పడిందనేది గడపగడపకూ కార్యక్రమంలో పుస్తకాలు ప్రింటు చేసి మరీ ఇచ్చారు. మూడేళ్ల గణాంకాలు ఇచ్చారు. ఒక్కసారిగా చూసుకుంటే రూ.లక్షలు కొందరికి కనిపించగా..ఎక్కువ కుటుంబాలకు రూ.వేలల్లోనే పడ్డాయి. దీన్నే రాష్ట్ర ప్రభుత్వం గొప్ప ప్రగతిగా చెప్పుకుంటోంది. అవినీతి లేకుండా నేరుగా జనం ఖాతాల్లోకి సొమ్ముపడింది. ఇందులో సందేహం లేదు. అదే సమయంలో పెరిగిన ధరలను ప్రభుత్వం ఏమాత్రం ఇక్కడ ప్రస్తావనే లేకుండా చేసింది. ఈ ప్రక్రియ ఇలా ఉంటే నాలుగేళ్లలో అభివృద్ధి ఎజెండా ఏమైనా కదిలిందా? అంటే ఏమీ లేదు. ఒక్క పతకం గానీ, ఒక్క ప్రాజెక్టు గానీ పూర్తి కాలేదు. చేపట్టలేదు. జిల్లా విభజనతో ఉన్న రామాయపట్నం పోర్టు కూడా పక్క జిల్లాకు పోయింది. నాలుగేళ్లలో జిల్లాలో కొత్తగా ఏం చేపట్టారనేది చెప్పుకోవడానికి కూడా ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఎన్నికల్లో సంక్షేమ పథకాలు తప్ప ఇది చేశామని చెప్పడానికి వైసిపి నేతలకు ఒక్కటీ లేదు. అన్నీ ఎండమావులుగానే మారాయి. విభజన చట్టంలో పొందుపొరిచినవి గానీ, రాజధాని ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలు గానీ ఏమీ లేవు. అన్నీ మరుగున పడిపోయాయి. జిల్లాకు సుమారు పది వరాలు ప్రకటించారు. అన్నీ ఎక్కడకు పోయాయో కూడా తెలియడం లేదు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్టు, దొనకొండ, కనిగిరి సెజ్‌లు, ఆక్వా యూనివర్శిటీ, విశ్వవిద్యాలయం, ట్రిపుల్‌ఐటీ, రైల్వే లైనులు ఇలా అనేకం ప్రకటించారు. వీటితోపాటు సోలార్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రూ.30 వేల కోట్లతో దొనకొండ వద్ద పరిశ్రమల కేంద్రాన్ని ▶ 2లో

సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్



'గడపగడపకూ..' కార్యక్రమంలో మంత్రి సురేష్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి సురేష్ ▶ 8లో

సాంకేతిక పరిజ్ఞానంతో

భౌతిక ఆధారాలను సేకరించాలి

బాపట్ల ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగించుకొని భౌతిక ఆధారాలను సేకరించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలి పారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యా లయంలో భౌతిక ఆధారాలు సేకరణ లో అత్యాధునిక పరికరాల వినియో గంపై శిక్షణ పొందిన పోలీసులకు మంగళవారం సర్టిఫికెట్లు అంద జేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరస్తులు తాము చేసిన నేరాలను కప్పి పుచ్చుకోవడానికి, చట్టాల నుంచి తప్పించుకోవడానికి నేరస్థలంలోని భౌతిక సాక్ష్యాధారాలను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులలో సహజమైన పద్ధతిలో నేర స్థలంలో భౌతిక సాక్ష్యా ధారాలు సేకరించడానికి చాలా శ్రమ పడాల్సి వస్తుంటుందన్నారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతిక పరికరాలను ఉపయోగించి సులువుగా భౌతిక సాక్ష్యాధారాలను సేకరించే అవకాశం ఏర్పడిందన్నారు. క్లూస్ టీమ్‌కు చెందిన ఎస్ఐ టి.శ్రీనివాసరావు మరో ఐదుగురు కానిస్టేబుళ్లను ఎపి ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ఆధ్వర్యంలో రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ, విజయవాడలో నిర్వహించిన క్రైమ్ సీన్ ప్రాసెసింగ్ శిక్షణకు పంపినట్లు చెప్పారు. అధునాతన పరికరాలను వినియోగించడంలో జిల్లా పోలీసులకు శిక్షణ ఇచ్చిన విజయవాడ రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. వీరకుమారి, సైంటిఫిక్ అసిస్టెంట్ వై.సూర్యనారాయణ బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పిని మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తాము ఇచ్చిన శిక్షణ గురించి ఎస్‌పికి వివరించారు. శిక్షణ పొందిన బాపట్ల క్లూస్ టీమ్ ఎస్ఐ టి.శ్రీనివాసరావు, పోలీస్ కానిస్టేబుళ్లకు ఎస్‌పి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం, వెల్లుల్లి ధరలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
మార్కెట్‌లో అల్లం, వెల్లుల్లి ధరలు ఘాటెక్కాయి. గత నెల వరకు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకున్న అల్లం, వెల్లుల్లి ధరలు పెద్దఎత్తున పెరిగినట్లు మహిళలు ఆందోళన చెందుతున్నారు. గతంలో అల్లం ధర కిలో రూ.30 నుంచి రూ.50 వరకూ పలికేది. ప్రస్తుతం రూ.200 నుంచి రూ.400 పలుకుతోంది. గతంలో వెల్లుల్లి కిలో ధర రూ.40 నుంచి రూ.60 వరకూ పలికేది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో రూ.120 నుంచి రూ.250 వరకూ పలుకుతోంది. దీంతో చాల మంది కూరల్లో వెల్లుల్లి, అల్లం వినియోగాన్ని తగ్గించారు.

రెస్టారెంట్ల నిర్వాహకులు గగ్గోలు..
కొంతకాలంగా యర్రగొండపాలెం నియోజక వర్గంలో రెస్టారెంట్ల సంఖ్య పెరిగిపోతుంది. ఫలితంగా అమ్మకాలు తగ్గి ఖర్చులు పెరుగుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు దారుణంగా పెరగడంతో తాము నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రెస్టారెంట్ల నిర్వాహకులు వాపోతున్నారు.

అల్లం, వెల్లుల్లి ధరలు బాగా పెరిగాయి
నాగుల లింగమ్మ, యర్రగొండపాలెం

కొంతకాలం క్రితం వరకూ అందరికీ అందుబాటులో ఉన్న అల్లం, వెల్లుల్లి ధరలు దారుణంగా పెరిగాయి. ప్రతిరోజూ వంటింట్లో ఏదోరకంగా వీటి వినియోగం తప్పనిసరి. ప్రభుత్వం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

పెరిగిన ధరలతో ఇబ్బందులు
తాటి గురవమ్మ, వేగినాటి కోటయ్య నగర్

అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వారంలో రెండుసార్లు పలావులు, చికెన్ తినేటోళ్లం. ప్రస్తుతం వారంలో ఒకసారి తినాలంటేనే ధరలతో భయం వేస్తోంది. పెరిగిన ధరలను తగ్గించాలి.

అభివృద్ధి జాడేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

స్థాపించాలనే నిర్ణయాలూ జరిగాయి. ఇంకా ప్రాంతాల వారీగా ఉన్న వనరుల ఆధారంగా పరిశ్రమలు, ఉపాధిని పెంచే కేంద్రాలు పెట్టాలని భావించారు. ఇవన్నీ ఇపుడు ఎక్కడ? అని ప్రశ్నించుకోవాల్సి వచ్చింది. గత ప్రభుత్వం ఐదేళ్లూ కాలయాపనే చేసింది. ఈ ప్రభుత్వం వీటిని అసలు పట్టించుకోలేదు. ప్రాధాన్యతల అంశాల్లో ఇవి లేవు. కేవలం సంక్షేమ ఎజెండాతోనే నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు రామాయపట్నం పోర్టుకు, దాని పక్కనే పేపరు పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఇపుడు పోర్టు పనులు మొదలు పెట్టారు. జిల్లా విభజనతో ఆ పోర్టు కూడా జిల్లాలో లేకుండా పోయింది. పేపరు పరిశ్రమ నిర్మాణం మొదలు కాలేదు. ఇప్పుడు పోర్టు అనే మాట జిల్లాలో వినిపించే పరిస్థితి లేదు. వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగం పనులు పూర్తయ్యాయి. నాలుగేళ్లుగా ఏటా దీన్ని ప్రారంభిస్తామని సిఎం ప్రకటిస్తూనే వస్తున్నారు. అక్టోబరులో గడువు పెట్టారు. పునరావాసం పెద్ద ఎజండాగా ఉంది. ప్యాకేజీలకు నిధులు కేటాయించాలి. సమయం తక్కువగా ఉంది. జరగాల్సిన ప్రక్రియ చాలా ఉంది. ఈ ప్రాంత రైతులు దీని కోసం పాతికేళ్లుగా ఎదురుచూస్తున్నారు. మిగతా వాటి విషయానికి వస్తే దొనకొండ వద్ద పరిశ్రమలు రాలేదు. అనేక సంస్థలు ఇక్కడ పరిశీలన చేశాయి. పరిశ్రమలు పెట్టడానికి ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. కొంత భూమిలో ప్లాట్లు వేశారే తప్ప పరిశ్రమలు లేవు. హెలికాప్టర్ల ఫ్యాక్టరీలు, విమానాశ్రయం తిరిగి అభివృద్ధి.. ఇలా అనేక రకాలుగా ప్రకటనలే వినిపించాయి. ఏమీ రాలేదు. కనిగిరి సెజ్‌ది ఇదే పరిస్థితి. భూసేకరణ ప్రక్రియతోనే ఆగిపోయింది. పీసీపల్లి సమీపంలో కొంత భూమిలో ప్లాట్లు వేశారు. అక్కడా పరిశ్రమలు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాల్లేవు. సోలార్ ప్రాజెక్టు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని ఎక్కడ పెట్టాలనేదీ స్పష్టత లేదు. ట్రిపుల్‌ఐటీ కాలేజీ ఎక్కడ నిర్మించాలనేదీ తేల్చలేదు. గత ప్రభుత్వం పామూరు సమీపంలో శంకుస్థాపన చేసింది. ప్రభుత్వం మారాక మళ్లీ ప్రాంతం ఎక్కడనే దానిపై సందిగ్ధం నెలకొంది. దీని నిర్మాణం ఆగిపోయింది. ఇంకా ఆక్వాయూనివర్సిటీ ఎక్కడనేదీ స్పష్టత లేదు. తాగునీటి సమస్య తీరలేదు. ఇప్పటికీ ఫ్లోరిన్ పీడిత ప్రాంతంగానే కనిగిరి నియోజకవర్గం ఉంది. సాగర్ జలాలు అందించే పథకాలు ఏ ఒక్కటీ పూర్తికాలేదు. నిర్వహణ లోపంతో అనేకం మూతపడ్డాయి. ప్రభుత్వాలు మారాక కొత్త పథకాలు వస్తాయి. పాతవి కనుమరుగవుతున్నాయి. ఇలా జిల్లాలో గత ప్రభుత్వం ఐదేళ్లలోనూ.. ఇప్పుడు నాలుగేళ్లలోనూ ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. రెండు ప్రభుత్వాల హయాంలో జిల్లాలోని కీలకమైన ప్రాజెక్టులు, పథకాలు మనుగడ ప్రశ్నార్థకంగానే మారింది. ఫలితంగా జిల్లాలో అభివృద్ధి పోలేదు. వలసలు తగ్గలేదు. జిల్లా సమగ్రాభివృద్ధి ఎజెండా ప్రశ్నార్థకమైంది.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి నాయకుల ధర్నా

ప్రజాశక్తి- కంభం రూరల్
కరెంటు కోతలు, విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక 133 కెవి, 32 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తోట వెంకట శ్రీనివాసరావు , ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులు, మైనారిటీ సెల్ కార్యదర్శి గౌస్, పాపిరెడ్డి, అనీస్ అహమ్మద్, ఖాదర్, మల్లికార్జున, దాదా, చెన్ను రవి, సిరివెళ్ల రవి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

తాగునీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్
ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వాడుక నీరు కూడా లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి- చెరుకుపల్లి
ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండల పరిధిలోని గుళ్లపల్లి గ్రామానికి చెందిన ఈమని పాల్ వేదాంతం అనే వృద్ధుడు గత నాలుగు రోజులుగా కనిపించడం లేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు సమీప గ్రామాల్లో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలలు హాల్ టికెట్లు జారీ చేయాల్సిందే. ఎవరైనా ట్యూషన్ ఫీజులు చెల్లించలేదని కారణాలతో హాల్ టికెట్లు నిరాకరిస్తే ఆ కళాశాల గుర్తింపు రద్దు చేస్తాం.

సిసి కెమెరాల ఏర్పాటు
సిసి కెమెరాల పటిష్ఠ నిఘాలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లోని అన్ని గదులు, ప్రధాన ప్రవేశ ద్వారం, ప్రశ్నాపత్రాల బండిల్స్ ఓపెన్ చేసే రూమ్, జవాబు పత్రాలు ప్యాక్ చేసే రూమ్‌తో సహా మొత్తం సిసి కెమెరాలు బిగించాం.. కేంద్రాల్లో ఏం జరుగుతుందనేది ప్రత్యక్షంగా చూసేందుకు వీలుగా ఒంగోలులోని ఆర్ఐఒ కార్యాలయానికి విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి సిసి కెమెరాలతో అనుసంధానించాం

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
పరీక్షల ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతించేది లేదు. ఉదయం 9. గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. 8.30 గంటలకే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తాం. పరీక్ష 9 గంటలకు ప్రారంభం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించం.మధ్యాహ్నం 2 గంటలకే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తాం. పరీక్ష మొదలైన 2.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యం గా వచ్చినా అనుమతించం.

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్స్ నిషిద్ధం.
చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లు, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఇతరస్టాఫ్ సిబ్బంది ఎవరు సెల్ ఫోన్లను పరీక్ష కేంద్రం లోనికి తీసుకురావద్దు. పరీక్షలకు సంబంధించిన ఎటువంటి సమస్య ఉన్నా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ 08592- 281275 ను సంప్రదించాలిచీఫ్ సూపరింటెండెంట్ తో పాటు కేంద్రంలో పనిచేసే సిబ్బంది ఎవరు మొబైల్ ఫోన్ తీసుకురాకూడదు. వేసవిని దష్టిలో పెట్టుకొని విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తున్నాం. ప్రతి పరీక్షా కేంద్రానికి బందోబస్తు కూడా ఏర్పాటు చేశాం.

విధులలో ఉంటే ఐడి తప్పనిసరి
పరీక్షా కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది ప్రతిఒక్కరు వారి గుర్తింపు కార్డును ధరించాలి. పరీక్ష జరిగిన కాలంలో తప్పుడు ప్రచారాలు చేసినా, తప్పుడు మార్గాలను అన్వేషించే వారిపై కఠినమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం పోలీస్ శాఖ ప్రత్యేకమైన బందాలను ఏర్పాటు చేసింది.

అధ్వానంగా రహదారులు..

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు
అభివృద్ధి, సంక్షేమమే తమ ధ్యేయమని పాలకుడు ఊదరగొడుతున్నారు. ఆచరణలో అది మచ్చుకైనా కనిపించడం లేదు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రహదారులు గుంతల మయంగా మారాయి. రోడ్డు మార్జిన్లు అధ్వానంగా తయార య్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాగులుప్పలపాడు నుచి అమ్మనబ్రోలు వెళ్లే రహదారిపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మార్జిన్ కూడా అధ్వానంగా మారింది. దీంతో వాహనాల రాకపోకల సమయంలో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అమ్మనబ్రోలు నుంచి కనపర్తి వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గుంతలు దర్శనమిస్తాయి. రాత్రి సమయంలో గుంతల కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవు తున్నారు. చదలవాడ నుంచి వీర్వానుప్పల పాడు వెళ్లే రహదారిలో మూడు కిలో మీటర్ల దూరంలో 30 గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టి తమను ఇక్కట్ల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా తయారైన అమ్మనబ్రోలు- కనపర్తి రహదారి

CHANGE OF NAME
I, ANNE HYMAVATHI(Old Name)
Resident of Flat No.302, Vamsi Enclave,
Sambasiva Nagar,Ongole, Prakasam Dist,
Pin -523001, Andhra Pradesh.
do hereby declare that i have changed my name from ANNE HAMAVATHI to
KOVI HYMAVATHI(New Name)
Hence forth i will be know as
KOVI HYMAVATHI
will be applicable for all purpose

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో..
I.P. 6/2023
Between:-
Angadi Durga Prasad S/o Prabhakar, auto driver, R/o 4th ward railpeta ,Bapatla (post)Bapatla (Dt) ....petitioner..
V/S
1) kaki malleswari W/o Vasu, R/o near park, railpeta, Bapatla.
2)Dalai Apparao,S/O Ramulu R/o Relly colony, Bapatla.
3)Itta Durga Rao S/o Gopaiah R/o park Bazar, railpeta, Bapatla .....respondents..
ఈ నెంబర్ పిటీషనరు Angadi Durga Prasad గారు బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో I.P 6/2023 ను Insolvent గా డిక్లయర్ చేయమని పై రెస్పాండెంట్స్ పై ఈ I.P.6/2023 పిటీషన్ దాఖలు చేసినారు. పైన చూపించిన రెస్పాండెంట్స్ గాక పిటిషనర్ కి ఎవరైనా బాకీ ఇచ్చి ఉన్న ఎడల ది 15-6-2023 వ తేదిన బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో హాజరయి మీ అక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ :15-6-2023.
ఇట్లు..
M.Sambasiva Rao,
Advocate, Bapatla (Dt).
Cel:9247261338.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

- ఎంపిడిఒ సుజాత
- అభివృద్ధి పనులపై సమీక్ష

మాట్లాడుతున్న ఎంపిడిఒ సుజాత

ప్రజాశక్తి- కొత్తపట్నం

సచివాలయ ఉద్యోగులకు నిర్ణీత సమయానికి విధులకు హాజరు కావాలని ఎంపిడిఒ పి. సుజాత తెలిపారు. వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్షా సమావేశ: నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 గంటలకు ఫేషియల్ అటెండెన్స్ వేసి విధులకు హాజరు కావాలన్నారు. సాయంత్రం 5 గంటలకు మళ్లీ అటెండెన్స్ వేయాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పక పాటించాలన్నారు. ప్రతి రోజు 25 సర్వీసులు తగ్గకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. .ఐఆర్‌టిసి టికెట్ బుకింగ్, కరెంట్ బిల్స్, లామినేషన్స్, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయపు సర్టిఫికెట్లు,వన్ బి అడంగల్ తదితర సర్వీసులు పెంచుకోవాలన్నార. సచివాలయ సిబ్బందికి సంబంధించిన జాబ్ చార్ట్ ప్రకారం అన్ని రికార్డులు ఉంచాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి షెడ్‌లో వర్మీ కంపోస్ట్ తయారు చేయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం స్పెషల్ శానిటేషన్ డే, ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో ఒఎస్ఆర్ ఫ్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. యుష్మాన్ భారత్ సర్వే చేయాలని సూచించారు. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రపరచాలన్నారు. ప్రజలకు సురక్షితమైన మంచి నీరు అందించాలన్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలతో స్నేహ పూరితంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సమ్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి బాల చెన్నయ్య , మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నరేంద్ర దేవ్, సీనియర్ అసిస్టెంట్ కె. సుదర్శన్, జూనియర్ అసిస్టెంట్ పి .తేజ , పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు

ఎఎస్ఐ హసన్‌కు అంత్యక్రియలు

హసన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న దర్శి డిఎస్‌పి

ప్రజాశక్తి - పంగులూరు

గుండెపోటుతో మృతిచెందిన ఎఎస్ఐ షేక్ హసన్ (55) అంత్యక్రియలు మంగళవారం పంగులూరులో నిర్వహించారు. పంగులూరు గ్రామానికి చెందిన షేక్ హసన్ ప్రకాశం జిల్లా కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతు హసన్ మృతుడి చెందాడు. స్వగ్రామమైన పంగులూరుకు హసన్ మతదేహాన్ని మంగళవారం తీసుకొచ్చారు. హసన్ మతుదేహాన్ని దర్శి డిఎస్పి అశోక్ వర్ధన్ రెడ్డి, పొదిలి సిఐ రాఘవేంద్ర, కొనకనమిట్ల ఎస్ఐ దీపిక సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో హసన్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. హసన్ కు భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు. **కొనకనమిట్ల :** కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ హసన్‌సాహెబ్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. హసన్ గతంలో కనిగిరి పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కొనకనమిట్ల పోలీస్‌స్టేసన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. హసన్ మృతి పట్ల ఎస్ఐ కె.దీపిక, పోలీసు సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి : పీడీ

మాట్లాడుతున్న పీడీ రవికుమార్

సంతనూతలపాడు రూరల్ : డ్వాక్రా సంఘాలు, సమైఖ్యలను ఆర్థిక సంస్థలుగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ఆర్‌పిలదేనని మెప్మా పీడీ టి. రవికుమార్ తెలిపారు. జిల్లాపరిధిలోని మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు రెండు రెసిడెన్షియల్ శిక్షణ తరగులను మండల పరిధిలోని ఎండ్లూరు డొంక వద్దనున్న మహిళా ప్రాంగణం మంగళవారం ప్రారంభించారు. ఆర్‌పిలను ఆరు బ్యాచ్‌లకు విభజించి మొత్తం 12 రోజుల పాటు శిక్షణా తరగుతులు నిర్వహిస్తున్నారు. మొదటి బ్యాచ్‌గా గిద్దలూరు, చీమకుర్తి మున్సిపాలిటీలకు చెందిన ఆర్‌పిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సభ్యురాలికి చేయూత, ఆసరా, బ్యాంకు లింకేజ్, స్వానిధి, జగనన్న తోడు పథకాల ద్వారా ఖచ్చితమైన జీవనోపాధి కల్పించేందుకు కషి చేయాలన్నారు. మహిళా ఉత్పత్తులు ప్రదర్శన అమ్మకాలు కోసం నెలకోసారి మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్పర్ట్‌లు జి.కల్పన, ఎన్.జయకుమార్, మాస్టర్ రిసోర్స్ పర్సన్ కె. కుమారి, టిడ్కో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డి. సూర్య ప్రకాశరావు, ఐటి యాంకర్ తారా శంకర్, డిఇఒ ఆదిలక్ష్మి, డిఆర్‌పి జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిహారంగా మారనున్న శివాలయం

సర్వాంగ సుందరంగా తయారైన శివాలయం

ప్రజాశక్తి - పంగులూరు

దాతల సహకారంతో కొండమూరు గ్రామానికే మణిహారంగా శివాలయం మారుతోంది. శిథిలావస్థకు చేరిన శివాలయం నేడు గ్రామ ప్రజల ఐక్యతతో సర్వాంగ సుందరంగా తయారైంది. సుమారు రూ. 40 లక్షల దాతల దాతత్వంతో శివాలయం కళకళలాడుతుంది. కొండమూరు గ్రామంలోని శివాలయం పురాతన కాలం నాటిది. ఆ దేవాలయాన్ని సుమారు 30 ఏళ్ళ క్రితం మళ్లీ పునర్ధురించారు. ప్రస్తుతం ఆ దేవాలయం శిథిలావస్థకు చేరుతున్నట్లుగా భావించిన గ్రామస్తులు కలిసికట్టుగా దేవాలయాని ప్రతిష్టకు ప్రతిరూపంగా మలచాలని నిర్ణయించుకున్నారు. శివాలయం తో పాటు నవగ్రహాలు, పార్వతీ అమ్మవారి ఆలయం కూడా ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకొచ్చారు. సుమారు రూ.40 లక్షల వసూలు చేశారు. సుమారు ఏడాది పాటు ఆలయ అభివృద్ధి పనులు నిర్వహించారు. శివాలయం, నవగ్రహాలు, పార్వతి అమ్మవారి గుడి, రెండు ఆర్చిలు నిర్మించినట్లు దేవాలయ నిర్మాణ బాధ్యతలు చూస్తున్న గంగిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు .

31న గుడి ప్రతిష్ట

కొండమూరు గ్రామంలో నిర్మించిన శివాలయం , నవగ్రహాలు, పార్వతి అమ్మవారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 31 నిర్వహిస్తున్నట్లు గంగిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. 27 నుంచి ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 31న ఆలయం, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి- కొత్తపట్నం

గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రంగాయ పాలెం పంచాయతీ పరిధిలోని సముద్రపు తీరాన మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సాంబశివరావు కథనం ప్రకారం... సుమారు 45 సంవత్సరాల వయసు కలిటగిన గుర్తుతెలియని వ్యక్తి తన లుంగీతో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్టు అధికారుల అదుపులోఉన్న వేటగాళ్లు

ఫారెస్టు అధికారుల అదుపులో వేటగాళ్లు

ప్రజాశక్తి-గిద్దలూరురూరల్

వన్యప్రాణులను వేటాడేందుకు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఐదుగురు వేటగాళ్లను ఫారెస్టు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అధికారుల కథనం ప్రకారం... గిద్దలూరు మండలం దిగువమెట్ట అటవీ సెక్షన్ పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో వేటగాళ్లు సంచరిస్తూ వన్యప్రాణులను వేటాడుతున్నట్లు గుండ్లకమ్మ ఫారెస్ట్ రేంజ్ అధికారి జీవన్ కుమార్ కుమార్ సమాచారం మేరకు డిఆర్ఒ డి. వంశీకష్ణ తన సిబ్బందితో మంగళవారం రాత్రి అటవీ ప్రాంతంలో గస్తీ తిరిగారు. అదే సమయంలో నరుకుడు తిప్ప వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో వేటగాళ్లు మూడు ఉడుములు, ఒక మౌస్ డీర్‌తో పారిపోయేందుకు ప్రయత్నించారు. అధికారులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామపొలాలలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి నాలుగు బైకులు, రూ.21, 630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొమరోలు

కొమరోలు, అర్ధవీడు మండలాలకు సంబంధించి ప్రజలు ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ అర్జీలు ఇస్తున్నారని, ఇకపై అలా అర్జీలు వస్తే సంబంధిత తహశీల్దారు, ఎంపిడిఒలపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. గిద్దలూరులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలోకలెక్టర్ దినేష్ కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు పరిష్కరించాలన్నారు. లేకుంటే సబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. అర్జీ దారులను పదే పదే తిప్పుకోకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

క్రికెట్ విజేత ఉత్తరప్రదేశ్ జట్టు

బహుమతి అందుకుంటున్న విజేత ఉత్తర ప్రదేశ్ జట్టు

ప్రజాశక్తి-పర్చూరు

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పర్చూరులో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించటం అభినందించ దగ్గ విషయమని టిడిపి బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పర్చూరులో జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు, ట్రస్టు ప్రతినిధులకు నరేంద్ర వర్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఏలూరి స్పోర్ట్స్ కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి టి-20 క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఫైనల్ పోటీలో విశాఖపట్నం సిక్కోలు చీతాస్ జట్టుపై ఉత్తరప్రదేశ్ శౌర్య జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాలూజ్ అందుకున్నాడు. ఉత్తమ బ్యాట్‌మెన్‌గా తిరుపతి జట్టు క్రీడాకారుడు తేజారెడ్డి, ఉత్తమ బౌలర్‌గా గుంటూరు మలినేని జట్టు క్రీడాకారుడు సుజిత్, ఉత్తమ కీపర్‌గా విశాఖపట్నంకు చెందిన గడ్డం సుజిత్, మ్యాన్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా ఉత్తరప్రదేశ్‌కు చెందిన విపిన్ చంద్ర ఎంపికయ్యారు. విజేత ఉత్తర ప్రదేశ్ జట్టుకు రు. 5 లక్షలు విక్రం నారాయణ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖపట్నం జట్టుకు రూ. 3 లక్షలు స్రీకర్ బయోటెక్ యాజమాన్యం, తృతీయ బహుమతిగా రూ. 2 లక్షలు తిరుపతి జట్టుకు కాకర్ల ఛారిటబుల్ ట్రస్టు, నాలుగో బహుమతి రూ. 1 లక్ష మలినేని గుంటూరు జట్టుకు పోట్రు శోభన్‌బాబు అందజేశారు. ఈ పోటీలకు ఎంపైర్లుగా అప్పలరెడ్డి, ముఖేష్ మోహన్, రవికృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు తులసి శ్రీనివాసరావు, మామిడిపాక హరిప్రసాద్, చెరుకూరి చింపయ్య, రవిచంద్ర, టిడిపి నాయకులు రాజశేఖర్‌బాబు, విక్రం వెంకట్రావు, సురేష్, షేక్ షంషుద్దీన్, నాయుడు, శేషబ్రహ్మాచారి, మానం హరిబాబు, పొద వీరయ్య, రంగయ్య చౌదరి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జేసీ

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న జేసీ

ప్రజాశక్తి- అద్దంకి

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలోని శింగరకొండ పాలెం జగనన్న కాలనీ లేఅవుట్ లోని గృహ నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ లబ్ధిదారులు వీలైనంత త్వరగా జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలపై అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూర్తి చేసుకొనేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచి, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : మోపిదేవి

మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణారావు

ప్రజాశక్తి- చెరుకుపల్లి

గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండాచర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు సూచించారు. స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వాకర్ రత్న ప్రసాద్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా కషి చేయా లన్నారు. అనంతరం వివిధ శాఖల వారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దారు మల్లికార్జునరావు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బోరింగులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండల పరిధిలోని పాత మాగులూరు ఎస్‌సి కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరింగులు రెండేళ్లుగా మూలనపడ్డాయి. వాటికి మరమ్మతులు చేపట్టే నాధుడే కనిపించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో 500 కుటుంబాల నివసిస్తున్నారు. అయితే కాలనీలోని 15 బోరింగులు మూలన పడ్డాయి. దీంతో కాలనీవాసులు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్య గురించి గ్రామ సర్పంచి , పంచాయతీ అధికారుల వద్ద మొరపెట్టిన పట్టించుకున్న నాధుడు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరింగులకు రిపేరు చేయకుండానే బిల్లులు చేసుకున్నట్లు వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరింగ్‌లకు మరమ్మతులు చేయించి తాగునీటి ఇబ్బందుల నుంచి తమను గట్టెక్కించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అల్లం అప్పారావు చిత్రపటానికి నివాళి

నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-వేటపాలెం

అల్లం అప్పారావు ఆకస్మిక మృతికి మంగళవారం నివాళు లర్పించినట్లు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు తెలిపారు. కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఫౌండర్, వైస్ చాన్స్‌లర్‌గా సేవలు అందించిన డాక్టర్ అల్లం అప్పారావు ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని తెలిపారు. తొలుత అప్పారావు చిత్రపటానికి సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల యాజమాన్యం, సిబ్బంది నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - పంగులూరు

వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు బయట మంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై ధర్మ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు చక్రవరం రంగరాజు, వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచి చక్రవరం రుక్మిణి తిరుమల రాజు తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకూ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచి తెలిపారు. చలివేంద్రాన్ని పాదచారులు, బస్సులు, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులు ఉపయోగించుకోవాలన్నారు. తన తల్లిదండ్రులు పేరుతో, తమ సొంత నిధులతో ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నట్లు రుక్మిణి తిరుమల రాజు చెప్పారు.

సివిల్స్‌లో మార్టూరు విద్యార్థిని ప్రతిభ

లక్ష్మీసుజిత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన సివిల్స్ ఫలితాలలో మార్టూరుకు చెందిన వీర గంధం లక్ష్మి సుజిత 311 ర్యాంకు సాధించింది. జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీ శ్రీనివాస విద్యాసంస్థల అధినేత వీరగంధం శ్రీనివాస్, భవాని దంపతుల కుమార్తె సుజిత మార్టూరులోని శ్రీనివాస హై స్కూల్‌లో 10 వ తరగతి సాధించింది. 9.8 జిపిఎతో మండలంలో టాపర్‌గా నిలించింది. రాయల్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేసింది. 982 మార్కులతో టాపర్ గా నిలిచింది. తమిళనాడు రాష్ట్రం తంజావూర్ శస్త్ర యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ బ్రాంచిలో 9.4 స్కోర్ సాధించి యూనివర్సిటీ టాపర్ గా నిలిచింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గా పనిచేస్తూ సివిల్స్ పై మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసింది. పట్టుదలతో కోచింగ్ తీసుకొని సివిల్స్‌లో 311 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా మార్టూరు రాయల్ విద్యాసంస్థల అధినేత పేరం రవీంద్రబాబు, ఇన్‌ఛార్జి కుడారి మధుబాబు, శ్రీనివాస విద్యాసంస్థల సిబ్బంది వీరగంధం శ్రీలక్ష్మి తదితరులు సుజితను అభినందించారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

అమ్మ ఆశ్రమానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అనాధ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న అమ్మ ఆశ్రమం శాశ్వత భవన నిర్మాణానికి యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, ఆయన సోదరులు సూర్యప్రకాష్ రావు, చంద్రశేఖర్, అడుగుల హరిబాబు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు, విజయలక్ష్మి దంపతులకు ఈ విరాళం అందజేశారు. అనాధ వద్ధులకు ఆశ్రయం కల్పించి అన్నదానం నిర్వహిస్తున్న గుంటుపల్లి చందును ఈ సందర్భంగా అభినందించారు.

నిత్యావసరాలు అందజేస్తున్న నిజాం

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

టిడిపి బాపట్ల నియోజకవర్గ బాధ్యులు వేగేసిన నరేంద్ర జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఛందోలు గ్రామ టిడిపి యువనాయకుడు నిజాం ఆధ్వర్యంలో మంగళవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిజాం మాట్లాడుతూ పేదలకు నిత్యావసరాలు అందజేయడం ఎంతో సంతోషం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మీరా, ఖాసీం, సైదా, బాజీ, టిటిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న తహశీల్దారు

మజ్జిగ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి- రేపల్లె

వేసవిలో మజ్జిగ పంపిణీ అభినందనీయమని తహశీల్దారు మల్లికార్జున రావు తెలిపారు. రేపల్లె పట్టణంలో పెద్ద మార్కెట్ సెంటర్ లో పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీని తహశీల్దారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ పట్టణ ఆదర్శ వేదిక మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎండల తీవ్రతను గమనించి పట్టణ ఆదర్శ వేదిక ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పావులూరి కష్ణమోహన్, కన్నా రాంబాబు, యజ్ఞపత రవితేజగారు, వెంకటేశ్, ఆదర్శవేదిక కార్యదర్శి యనపల్లి కిషోర్, సాయి కష్ణమాచార్యులు, కె.రాంబాబు, పి.రాజు, కష్ణమోహన, శ్రీనువాసరావు, పూర్ణగారు, వర్షిని, అనూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
బుధవారం 24 మే 2023

బాలినేని వియ్యంకుడైన

భాస్కర్‌రెడ్డితో ప్రాణహాని ఉంది..

భాస్కర్‌రెడ్డి మాజీ పీఏ ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు, విశాఖపట్నంకు చెందిన భాస్కర్‌రెడ్డితో తనకు ప్రాణహాని ఉందని భాస్కర్‌రెడ్డి మాజీ పీఏ తోట ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత తాలూకాపోలీస్ స్టేషన్ వద్ద హైడ్రామా నడిచింది. దీంతో ఆంజనేయులు కుటుంబసభ్యులు. బంధువులు నిరసన తెలియజేయడంతో పాటు ఆత్మాహుతికి పాల్పడతామంటూ భీష్మించారు.

తోట ఆంజేయులు నేపథ్యం..

సంతనూతలపాడు మండలం, ఎండ్లూరుకు చెందిన తోట ఆంజనేయులు గత 15 సంవత్సరాలుగా విశాఖపట్నంకు చెందిన కుండా భాస్కర్‌రెడ్డి వద్ద పి.ఎ.గా పనిచేశాడు. ఆరు నెలల క్రితం అతను తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. అయితే గత కొంతకాలంగా విశాఖపట్నంకు చెందిన జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ భాస్కర్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడుతూ భూ కబ్జాలకు పాల్పడుతున్నారంటూ విమర్శలు చేశారు. మూర్తియాదవ్‌కు తోట ఆంజనేయులు పూర్తి సమచారం ఇస్తున్నట్లుగా భాస్కర్‌రెడ్డి అనుమానించారు. అప్పటి నుండి తమ నివాసం వద్దకు భాస్కర్‌రెడ్డి అనుచరులు, పోలీసులు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆంజనేయులు భార్య పద్మ తెలిపారు. వచ్చినవారు మీ కుమారుడు ఎక్కడ చదువుకుంటున్నాడో అంతా తెలుసునని, తాము ఏదైనా చేయగలమని బెదిరించినట్లు చెప్పారు.

ఆంజనేయులుపై ఫిర్యాదు

ఒంగోలుకు చెందిన నరేష్ అనే వ్యక్తి తోట ఆంజనేయులుపై ఫోర్జరీ చేశారని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆంజనేయులు లేని భూమిని ఉన్నట్లు చూపి తనకు అమ్మాడని, అక్కడ స్థలం లేదని, మోసం చేశాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో ఆదివారం సాయంత్రం ఆంజేయులు తన తల్లి కర్మకు వచ్చి వెళుతున్న సమయంలో ఎండ్లూరు డొంక వద్ద ఆంజనేయులు, ఆతని భార్య పద్మను పోలీసులు అదుపులోకి తీసుకొని మద్దిపాడు స్టేషన్‌కు తరలించారు. తెల్లవారుజామున భార్య పద్మను వదలేసిన తరువాత ఉదయం ఆంజనేయులును కూడా వదలేశారు. మరలా సోమవారం సాయంత్రం ఆంజనేయులను తాలూకా పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు .కొంత సమయం అతడిని స్టేషన్‌లోనే ఉండాలని, మిగిలిన కుటుంబసభ్యులు వెళ్లాలని తెలిపారు. అతడిని తీసుకొని పోలీసులు విశాఖపట్నం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఒక్కడినే పంపబోమని తాము కూడా అతనితోనే ఉంటామని వారి కుటుంబసభ్యులు చెప్పారు. పోలీసులు రాజకీయ పలుకుబడికి ఏదైనా చేస్తారనే భయం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తోట ఆంజనేయులును స్టేషన్‌లోనే ఉంచారు. దీనితో వారి బంధువులు పోలీస్‌స్టేషన్ బయటే వేచి ఉన్నారు.

ఫోర్జరీ కేసులో ఆంజనేయులు అరెస్టు

ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి

మాట్లాడుతున్న ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

స్థలం అగ్రిమెంట్‌లో ఫోర్జరీ సంతకాలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్ లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంతనూతలపాడు మండలం, ఎండ్లూరు గ్రామానికి చెందిన తోట ఆంజనేయులు గతంలో వైజాగ్‌కు చెందిన ఒంగోలు ఎంఎల్‌ఎ బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కొండా భాస్కర్ రెడ్డి వద్ద పి.ఎ.గా పనిచేసినట్లు తెలిపారు. అక్కడ కూడా అనేక అవకతవకలకు పాల్పడినట్లు అక్కడ ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఆంజనేయులు ఒంగోలు పట్టణానికి చెందిన స్థలం అమ్మకం విషయంలో ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్ చేసినట్లు తెలిపారు. ఒంగోలు ఇందుర్తి నగర్‌కు చెందిన ఇందుర్తి నరేష్ అనే వ్యక్తి కి 2022 వ సంవత్సరంలో స్థలం అమ్మినట్లు చెప్పారు. దీంతో ఇందుర్తి నరేష్ ఫిర్యాదు మేరకు అంజనేయులును అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో తాలూకా సిఐ ఆర్.రాంబాబు, ఎస్ఐ అంకమ్మ పాల్గొన్నారు.

జగనన్న పాలన అందరికీ ఆదర్శం

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

ప్రజాశక్తి-దరిశి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నేటికి నాలుగేళ్ళు పూర్తి అయిన సందర్భంగా ఆయన పాలన అందరికి ఆదర్శమని స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో జగనన్న పాలన నాలుగేళ్ళు పూర్తి అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అంతకుముందు దరిశి నగర పంచాయతీలోని 1, 2 వార్డులలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, వైసిపి మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, కమిషనరు మహేష్, సుంకర బ్రహ్మానందరెడ్డి, గోళ్లపాటి అచ్చయ్య, రాము, శ్రీనివాసరావు, మల్లిఖార్జున, భాస్కర్‌రెడ్డి, హరీష్, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్‌బాబు



ప్రజలతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి తిరిగి జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. కొండపి మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో మంగళవారం నాడు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో కలిసి గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్దిని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు సీనియర్ నాయకులు భువనగిరి సత్యనారాయణ, యంపిటిసి, డీలర్ బ్రహ్మయ్య, గ్రామ నాయకులతో పాటు మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఎస్.పురం మండలం రెహమాన్ కళ్యాణమండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని వాలంటీర్స్‌కు సేవావజ్ర, సేవారత్నా, సేవా మిత్ర అవార్డులను అందజేసి ప్రతి వాలంటీర్‌ను టిటిడి పాలక మండలి సభ్యులు, కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి మూడమంచు వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి మేకల శ్రీనివాసులు, మండల సచివాలయ కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, భువనగిరి వెంకటయ్య, వైస్‌ఎంపిపి డి.ప్రతాప్‌రెడ్డి, డి.జయరెడ్డి, షేక్.బుజ్జి, పెరుగు సుబ్బరామయ్య, చల్లా రాఘవులు, భూమిరెడ్డి వెంకటరెడ్డి, రాధా కష్ణరెడ్డి, ఎం.అటేలయ్య, మేకల బాలు, సిఎస్.పురం మండలంలోని వైసిపి నాయుకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో వాళ్లకి

ఇక్కడ మస్టర్ వేస్తున్నారు..

అధికారుల తీరుపై సొసైటీ ఛైర్మన్ ఆగ్రహం

కనుమల్ల గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

'ఉపాధి హామీ పథకంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి.. ఇక్కడ పనిచేసే కూలీలకు అన్యాయం జరుగుతోంది. అమెరికాలో ఉన్న వాళ్లకి ఇక్కడ అధికారులు మస్టర్ వేసి కూలీల కడుపు కొడుతున్నారు' అని కనుమళ్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శింగరాయకొండ మండలం, కనుమల్ల, సోమరాజుపల్లి గ్రామాల్లో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. కనుమల్ల సచివాలయం వద్ద జరిగిన గ్రామసభకు ఎంపీపీ కట్టా శోబారాణి, సర్పంచ్ మలినేని ఇందిరా, కనుమల్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు హాజరయ్యారు. గ్రామసభలో ఇంటింటికి తిరిగి విచారణ చేసి అక్కడ సభ నిర్వహించగా ఈ సభలో కూలీలు మాట్లాడుతూ వారానికి రూ.400 కూడా పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ జరుగుతుండగానే.. అక్కడ ఉన్న జనం బయటికి వెళ్లిపోయారు. సోమరాజుపల్లి సచివాలయం వద్ద కూడా గ్రామసభ నిర్వహించి అక్కడ కూడా దొంగ మాస్టర్ల వ్యవహారంతో పాటు 400 చెట్లు వేస్తే 120 మాత్రమే ఉన్నాయని సభ దృష్టికి తేగా.. అక్కడ ఉన్న ఉపాధి అధికారులు సమాధానం చెప్పలేకపోయారు.

పలకల కార్మికులకు

కూలి పెంచాలని హైవేపై రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

డిజైన్ స్లేట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికుల కూలి పాత అగ్రిమెంట్ కాలపరిమితి ముగియడంతో పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని, యజమానుల మొండివైఖరి విడనాడాలని కోరుతూ కార్మికులు మంగళవారం జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, డిజైన్ స్లేట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి రూబెన్ మాట్లాడుతూ కార్మికుల కూలి పెంచకుండా యజమానులు చర్చల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేసే విధంగా కనీస వేతన చట్టం ప్రకారం కూలి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం బాల శేషయ్య, టి రాములు, ప్రకాశం, కొండయ్య, పుల్లయ్య, దానియేలు, బాబ్జి, కాశయ్య, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న ఎస్ఐ

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..

పది నిమిషాల్లో కనుగొన్న పోలీసులు

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన కత్తి అంజనేయులు భార్య శ్రీలత దంపతుల కుమారుడు నాగశౌర్య దరిశిలో ఒక షాపు వద్ద తప్పిపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానిక ఎస్ఐ రామక్రిష్ణ పోలీసులతో కలిసి తప్పిపోయిన బాలుడిని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ రామక్రిష్ణను తల్లిదండ్రులు అభినందించారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని మారెళ్లలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొదిలి సుబ్బమ్మ (73) వడదెబ్బకు గురై తెల్లవారుజామున మతిచెందింది. మతురాలి భర్త గతంలోనే చనిపోయారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పివి.శేషయ్య ఒక ప్రకటనలో కోరారు. రూ.కోట్లల్లో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా.. రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించటంలో అధికారులు నిర్లక్ష్యం వహించటం సరికాదన్నారు. ఎండలకు ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారని, సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు.

శనగల వెంకటేశ్వర్‌రెడ్డికి మాతృవియోగం

ప్రజాశక్తి-పొదిలి

మండలంలో జువ్వలేరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ శనగల వెంకటేశ్వర రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన మాతమూర్తి, ప్రస్తుత సర్పంచి శనగల సుధాకర్‌రెడ్డి నాయనమ్మ వెంకట నర్సమ్మ అనారోగ్య కారణంగా మంగళవారం మతి చెందింది. ఈ సందర్భంగా కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి నర్సమ్మ మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బజాజ్ రమణారెడ్డి, వెలుగోలు కాశీ, దొర్నాల రమణారెడ్డి ఆర్.డబ్ల్యు.యస్ ఎఇ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-సిఎస్‌పురం

క్రీడలు స్నేహభావం పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దర్శి గుంటపేట గ్రామంలో షఫీ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షఫీ చాలా మంచి వ్యక్తి అని, ఆయన జ్ఞాపకార్థంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలకొండయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు మంగళవారం నాడు నిర్వహించారు. కొండపి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు గ్రంథపాలకుడు కోటేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత కథలు చెప్పించడం,పుస్తకాలు చదివించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మేరి రేచల్ కుటుంబానికి న్యాయం చేయాలి

తమ్మిశెట్టి రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మేరీ రేచల్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎక్స్ మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు మహిళాభ్యుదయ సమితి డైరెక్టర్ తమ్మిశెట్టి రమాదేవి తెలిపారు. ఆదివారం రాత్రి పూరిమెట్ల గ్రామానికి సంబంధించిన రఘురాజు, కుమారిల పెద్ద కుమార్తె, బయట మంజులూరు వాస్తవ్యులైన అబ్రహం రాములమ్మల కోడలు సందేపోవు మేరీ రేచల్ ఉరివేసుకొని చనిపోయిందని ఆమె అత్త, మామ తెలిపారు. ఆమె తల్లిదండ్రులు, బంధువులు అది ఆత్మహత్య కాదు కట్నం తేలేదని వేధించి ఉరివేసి చంపారని ఆరోపించారు. ఆదివారం ఆమె చనిపోగా ఇంతవరకు పోస్టుమార్టం చేయకపోవడం, సరైన కేసు నమోదు చేయకపోవటంతో వారి బంధువులు ఆందోళనతో సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ళ అరుణకి సమాచారం అందించారు. ఆమె సలహా మేరకు తమ్మిశెట్టి రమాదేవి, సిహెచ్ కనకదుర్గ పోస్టుమార్టం వద్దకు వెళ్లి బాధితురాలి బంధువులు, ఇన్‌ఛార్జి డిఎస్‌పితో మాట్లాడి హత్య కేసుగా నమోదు చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరగాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రేచల్‌కు మూడు సంవత్సరాల కుమార్తె, సంవత్సరంలోపు కుమారుడు ఉన్నారని, వారికి కూడా న్యాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటా..: బుర్రా

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఇటీవల హత్యకు గురైన కోటా రాధ తండ్రి సుధాకర్ రెడ్డిని శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ మంగళ వారం పరామర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ రాధ హత్య వివరాలను తెలుసుకొని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. న్యాయపరమైన సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు పొల్లా సుబ్రమణ్యం, వైసిపి నాయకులు వై.నాగూర్‌యాదవ్, మేడం ఆదిరెడ్డి, ఉప్పనబోయిన వెంకటరామయ్య, ఎలిక నారాయణ, గంజి రవీంద్రారెడ్డి, చిలకల క్రిష్ణారెడ్డి, ఎంపిటిసి దేవిరెడ్డి జనార్దన్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

కరాటే కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

విద్యార్థికి కరాటే కిట్ అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థినికి యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ అధ్యక్షులు కరాటే కిట్ ను మంగళవారం అందజేశారు. పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వై. తేజస్విని అనే పేద కరాటే విద్యార్థినికి యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్య తన సొంత ఆర్థిక నిధులు సమకూర్చి అమ్మాయి కరాటే విద్యలో బాగా రాణించడానికి అవసరమైన కరాటే కిట్ ను కరాటే మాస్టర్ భూతరాజు వెంకటేశ్వర్లు సమక్షంలో అందజేశారు.

29న ఆలయ భూముల కౌలు వేలం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం జె పుల్లలచెరువు గ్రామ సమీపం లో వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయ భూముల కౌలు బహిరంగ వేలం పాటలు ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. రైతులు వేలం పాటలో పాల్గొని దేవాదాయ ధర్మాదాయ శాఖ షరతులను అనుసరించి.. పొలం కౌలుకు తీసుకుని సాగుచేసుకోవాలని కోరారు.

విద్యుత్ ఛార్జీల పెంపు దుర్మార్గం

- కరెంటు కోతలను అరికట్టాలి - టిడిపి ఆధ్వర్యంలో వెలువెత్తిన నిరసనలు

కనిగిరిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో విద్యుత్ కోతలతో పాటు విద్యుత్ ఛార్జీలు కూడా పెరిగిపోయాయని, దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నేతలు పిలుపునిచ్చారు. విద్యుత్ కోతలు, ఛార్జీల పెంపును వ్యతిరేకంగా టిడిపి ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల నిరసనలు తెలిపారు.

ప్రజాశక్తి-కనిగిరి

విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ.. టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలో ప్లకార్డులతో బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈఈ ఎం నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ ఫిరోజ్,నంబుల వెంకటేశ్వర్లు, చింతలపూడి తిరుపాలు, ఈదర రవికుమార్, ఆర్‌వి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురం విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు గాయం రామిరెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు కందుల వెంకటసుబ్బారెడ్డి, మండల కార్యదర్శి చీకటి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పెద్దారవీడు: టిడిపి పెద్దారవీడు మండల అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట టిడిపి నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్దారవీడు మండల అధ్యక్షులు మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ కమిటీ సభ్యులు జడ్డా రవి, నక్కా శ్రీను, ఎంపీటీసీ దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ పాపిరెడ్డి పాల్గొన్నారు.

వెలిగండ్ల: టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి, రైతులు రైతు అధ్యక్షులు మీనిగ కాశయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కారంపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక సబ్‌స్టేషన్ వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సొరెడ్డి మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు పూనూరి భూపాల్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు సైదులు, ప్రధాన కార్యదర్శి ముప్పూరి రాము, బీసీ సాధికార రాష్ట్ర సభ్యులు బోయిళ్ల రోషన్ బాబు పాల్గొన్నారు.

గిద్దలూరు: పట్టణంలోని ఒంగోలు రోడ్డులోని విద్యుత్ కేంద్రం వద్ద పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు షేక్ అహమ్మద్ బాషా, ఎస్సి సెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి విద్యుత్ ఏఈ తలపాటి అల్లూరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ మన్నె రవీంద్ర, మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, మంత్రూ నాయక్, కామేపల్లి వెంకటేశ్వర్లు, భాస్కర్, చెవుల అంజయ్య, బోడా చెన్నవీరయ్య పాల్గొన్నారు.

త్రిపురాంతకం: టిడిపి మండల అధ్యక్షులు మేకల రాజు ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవినేని చలమయ్య, మల్లెల అల్లురెడ్డి, వంకాయలపాటి ఆంజనేయులు, గుత్తా వెంకటనారాయణ, గుర్రం సునీల్ చౌదరి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ అధికారులకు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, సమ్మద్‌బాషా, సుబ్బరత్నం, శేషాద్రి, నాగేంద్రబాబు, ఇస్మాయిల్, చెంచయ్య పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ముండ్లమూరు: ముండ్లమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీడీపీ నాయకులు ముట్టడించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూర పాటి శ్రీను, మాజీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావు, శంకరాపురం, వేముల, వేములబండ సర్పంచులు కూరపాటి నారాయణ స్వామి, గజ్జెల సుబ్బారెడ్డి, సి.హెచ్ ప్రసాద్, మాజీ జెడ్పిటిసిలు పౌల్, కె.నాగరాజు పాల్గొన్నారు.

పిసిపల్లి: టిడిపి ఆధ్వర్యంలో పిసిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వేమూరి రామయ్య, మురుగుమ్మి పంచాయతీ అధ్యక్షులు హనుమారెడ్డి, టిడిపి యూత్ నాయకులు వేణుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సిఎస్.పురం: టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలకొండయ్య, రామకృష్ణంరాజు, చావా శేఖర్, దేవెండ్ల తిరుపతయ్య, కోటిరెడ్డి, వరయ్య, వెంకటకొండయ్య పాల్గొన్నారు.

శింగరాయకొండ: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడిఈ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కొనపురెడ్డి వెంకట సుబ్బారావు, పులి ప్రసాదు, ఇమ్మడిశెట్టి రామారావు పాల్గొన్నారు.

బేస్తవారిపేటలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

బంధువులకు వృద్ధురాలు అప్పగింత

వృద్ధురాలిని బంధువులకు అప్పగిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి- కంభం రూరల్

దారి తప్పిన వృద్ధురాలిని పోలీసులు ఆమె బంధువులకు అప్పగించారు. అందిన సమాచారం మేరకు మూడు రోజుల క్రితం ఒరిస్సా నుంచి పుట్టపర్తికి వెళ్తున్న ఓ వృద్ధురాలు కంభం రైల్వే స్టేషన్ దిగింది. త్వరాత రైలు వెళ్లి పోవడంతో ఆమె దారి తప్పింది. అనతరం స్థానిక కందులాపురం సెంటర్‌లో తిరుగుతుండగా సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. కంభం ఎస్ఐ వి. నాగమల్లేశ్వరరావు వృద్ధురాలిని గిద్దలూరు లోని సంజీవని ఫ్యూచర్ హెల్ప్ చారిటబుల్ ఫౌండేషన్ అనాధ వద్ధాశ్రమానికి తరలించారు. వద్ధాశ్రమ నిర్వా హకుడు రాజశేఖర్ ఒరిస్సాలోని తమ వాలంటీర్లకు సమాచారం అందించారు. వారు ఒరిస్సాలోని జాజ్పూర్ జిల్లా భరత్‌పూర్‌కు చెందిన వద్ధురాలు గుర్తించారు. బంధుమిత్రులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వృద్ధురాలి మనమళ్ల బుధవారం గిద్దలూరుకు వచ్చి అనాధాశ్రమ నిర్వాహకులను కలిశారు. ఆశ్రమ నిర్వాహకుడు రాజశేఖర్ ఆమెను కంభంకు తీసుకొచ్చి పోలీసుల సమక్షంలో వారి మనమళ్లకు అప్పగించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వర రావు వద్ధాశ్రమ నిర్వాహకులు రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకట్, నారాయణను అభినందించారు.

పిచ్చయ్యకు సేవా పురస్కారం

సన్మానం అందుకుంటున్న పిచ్చయ్య

ప్రజాశక్తి-పొదిలి

అనన్య ఫౌండేషన్ మరియు లిటిల్ చాంప్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన జాతీయ పురస్కార వేడుకల్లో ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఉడుముల పిచ్చిరెడ్డి సేవా పురస్కారం అందు కున్నారు. సికింద్రాబాద్‌లోని తార్నాక ఎంఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పిచ్చిరెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పిచ్చిరెడ్డి సామాజిక సేవారంగం, రాజకీయ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. రాజకీయపరం, సేవాపరంగా అనేక మందికి సేవలందిస్తూ పలువురికి మార్గ దర్శకంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు నరసింహ, నంది డాక్టర్ లయన్ పులి శ్రీనివాస ప్రసాద్, లిటిల్ చాంప్స్ అకాడమీ సెక్రెటరీ బుచ్చేశ్వరరావు, తెలంగాణా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి బెల్లం మాధవి, అనన్య ఫౌండేషన్ నిర్వాహకులు నవనీత, జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం బాధ్యత పంచాయతీలదే

స్పెషలాఫీసర్ నారద ముని

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నారదముని

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజల ఆరోగ్యం బాధ్యత పూర్తిగా పంచాయతీల దేనని కొండపి నియోజక వర్గ ప్రత్యేకాధికారి బి. నారదముని అన్నారు. టంగుటూరు మేజర్ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న పారి శుధ్యాన్ని మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ ల్లోని మురుగు నీరు పారుదల సక్రమంగా అయ్యేలా చూడాలన్నారు. దోమల నిర్మూలనకు కాలువలలో ఎబేట్ ద్రావణం స్ప్రే చేయడంతో పాటు ఫాగింగ్ నిర్వహించాలన్నారు. పంచాయతీ పరిధిలోని కాలనీలలో 1400 వరకు పందులు ఉండగా సదరు యజమానులు 400 వరకు బయటకు తరలించినట్లు ఇఓ జగదీష్ ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ దష్టికి తెచ్చారు. పంచాయతీలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యులు 104 వాహనం ద్వారా ప్రతి వారం అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న బాచిన కృష్ణచైతన్య

ఉద్యోగులకు అండగా ఉంటాం : బాచిన

ప్రజాశక్తి- అద్దంకి

అద్దంకి నియోజకవర్గ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగస్తులకు అండగా ఉంటామని రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బాచిన కష్ణ చైతన్య తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ యూనియన్ నాయకులు మంగళవారం కృష్ణ చైతన్య కలిశారు. ఈ సందర్భంగా తమ పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి తమ వంతు కషి చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణచైతన్యను కలిసిన వారిలో బాపట్ల జిల్లా గ్రామ వార్డు సచివాలయ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రామయ్య, చీరాల డివిజన్ సెక్రెటరీ పి.శీనివాసరావు, నాగ బ్రహ్మాచారి, మస్తాన్‌రావు యూనియన్ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఆమంచి

వైఎస్ఆర్ రైతు రథం పథకం ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఆమంచి

ప్రజాశక్తి-పర్చూరు

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు చీరాల మాజీ ఎమ్మెల్యే, వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. మండల పరిధిలోని అన్నంబొట వారిపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని గర్నెపూడి, గోరంట్లవారిపాలెం, ఎడారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్నంబొట్లవారి జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వైఎస్ఆర్ రైతు రథం పథకం ట్రాక్టర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ, కాలువలు, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ గడప గడపకూ తిరిగాడు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్చూరు, గర్నెపూడి సర్పంచులు బిరుదు నాగేంద్రమ్మ, గోరంట్ల భాస్కర్ రావు, వైసిపి మండల కన్వీనర్ కటారి అప్పారావు, నాయకులు వంకాయలపాటి వీరయ్య, గోరంట్ల శివకుమారి, కొనకంచి సుబ్బారావు, చిన్నపాటి నాగేశ్వరరావు, తోకల కష్ణమోహన్, దగ్గుబాటి రామకష్ణ, ఉప్పలపాటి అనిల్ చౌదరి, గోరంట్ల బాబు, కొల్ల రామకష్ణ, గన్నేటి సత్యనారాయణ , పఠాన్ అక్బర్ , ఆలనేటి చెన్నయ్య, విష్ణుమూర్తి, మాజీ సర్పంచి గోరంట్ల సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పరిశీలన

పుస్తకాలను పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖ అధికారి

ప్రజాశక్తి - కంభం రూరల్

స్థానిక గురుకుల పాఠశాలలోని జెవికె -4 స్టాక్ పాయింట్‌ను మార్కాపురం ఉప విద్యా శాఖాధికారి ఎ. చంద్ర మౌళీశ్వర్ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న విద్యా కానుక నిల్వ కేంద్రంలోని పాఠ్య పుస్తకాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభించేనాటికి ముందుగానే జగనన్న విద్యా కానుకల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అనంతరం సిఆర్‌పిలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న విద్యాకానుక పంపిణీ పర్యవేక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. పాఠశాలల్లో పరిశీలించిన అన్ని అంశాలను ఎజిఆర్‌లో నమోదు చేయాలన్నారు. బడి బయటి పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని నిబద్ధతతో నిర్వహించాలన్నారు. అకడమిక్ అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి. మల్యాద్రి, ఎంఇఓ కార్యాలయ సిబ్బంది, సిఆర్‌పిలు మురళీమోహన్, రామలింగయ్య, రవీంద్ర నాయక్, బాబూరావు,శైలజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎపిఇఎపి సెట్ పరీక్షలు

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని టిసిఎస్ ఐయాన్ సెంటర్‌లో నిర్వహించిన ఎపిఇఎపి సెట్ - 2023 పరీక్షలు మంగళవారంతో ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణా రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులలో అడ్మిషన్ల కోసం ఎపిఇఎపి సెట్-2023 పరీక్షలు అనంతరంలోని జెఎన్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జైపిసి విభాగం విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 23 వరకూ 2 షిఫ్టులలో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అనిల్ కుమార్ తెలిపారు. పరీక్షలకు డాక్టర్ డి.సమీర్ కుమార్ పరిశీలకుడిగా వ్యవహరించారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - నిజాంపట్నం

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాల పాలకురాలు ఎన్.విజయలక్ష్మి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని మరింత పరిజ్ఞానం పెంపొందించు కోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలన్నారు. పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారిని తల్లిదండ్రులు గ్రంథాలయాలకు పంపాలన్నారు. **అద్దంకి :** విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని స్థానిక గ్రంథపాలకుడు సిహెచ్. సుగుణరావు తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఫిజిక్స్ క్లాసులను ఎస్‌బిఐ మాజీ ఉద్యోగి, సజన అధ్యక్షుడు దివాకర్ దత్తు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంగ్లీష్ స్టోరీ టెల్లింగ్ మ్యాథమెటిక్స్ క్విజ్ ఫ్యాకల్టీగా సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రాజు నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకువిద్వాన్ జ్యోతి చంద్రమౌళి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు

రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మిదేవి

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కారంచేడు

పిపిఎల్ ఫెర్టిలైజర్ కంపెనీ రైతులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిపిఎల్ సంస్థ ప్రతినిధి లక్ష్మిదేవి తెలిపారు. బాపట్ల జిల్లా కారంచేడు మండల పరిధిలోని కుంకలమర్రు, కారంచేడు రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులతో బిపిఎల్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ రైతులు తమ కంపెనీ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిపిఎల్ కంపెనీ తయారు చేసి రైతులకు అందిస్తున్న ఉత్పత్తుల ప్రాధాన్యత గురించి వివరించారు. మట్టి నమూనా పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. మట్టి పరీక్ష ఆధారంగా మందులు వినియోగించి అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అనూష, జొన్నలగడ్డ జ్యోతి, లక్ష్మీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్ ప్రొప్రైటర్ సుబ్బరాయుడు, డిపిటి వెంకట్రావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పురపాలక సంఘాలకు

భారంగా చెత్త సేకరణ వాహనాలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం పురపాలక సంఘాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ లక్ష్యంగా నాలుగు చక్రాలతో కూడిన వాహనాలను పంపారు. ప్రైవేట్ ఏజన్సీ లకు ఈ వాహనాల బాధ్యతలను అప్పజెప్పారు. ఈ చెత్తసేకరణ వాహనంలో ఉన్న సిబ్బంది రోజు ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్త సేకరణ చేయాల్సిఉంది. ఈ చెత్త వాహనాల నిర్వహణ కోసం పురపాలక సంఘంలో యూజర్ చార్జీలు వసూలు చేసి ప్రతి నెల ప్రైవేట్ ఏజన్సీకి చెల్లించాలి.ఇలా బాపట్ల జిల్లాలో చీరాల, బాపట్ల పురపాలక సంఘాల నుంచి ప్రతి నెల ఒక్కొక్క వాహనానికి రూ.55 వేలు ఒంగోలు నగరపాలక సంస్థ నుంచి ఒక్కొక్క వాహనానికి రూ.65 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. చీరాల నుంచి ప్రతి నెల రూ.6 లక్షలు చొప్పున గత రెండు సంవత్సరాలుగా రూ.కోటి 44 లక్షల వరకు చెల్లిస్తూ వచ్చారు.ఒంగోలులో అయితే ప్రతి నెల రూ.40 లక్షలు చొప్పున రూ.9 కోట్ల 60 లక్షల వరకు ప్రైవేట్ ఏజన్సీకి చెల్లించారు. అసలు చెత్త సేకరణ వాహనాల కొనుగోలు అంశం పురపాలక సంఘాలకే ఇస్తే ప్రైవేట్ ఏజన్సీకి చెల్లించిన సొమ్ములతో సగం మొత్తాలకే సదరు వాహనాలు వచ్చేవి.ఒక్కొక్క వాహనం రూ.7 లక్షలు ఖరీదు అనుకున్నా ఒంగోలు నగర పాలక సంస్థకు ప్రతి నెల కనీసంగా 5 వాహనాలు సొంతంగా సమకూరేవి. ప్రతి నెలా ప్రజల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేసి ప్రైవేట్ ఏజన్సీకి చెల్లించడమే పురపాలక కర్తవ్యం అన్నట్లుగా అయ్యింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే వారి వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. త్రిపురాంతకం మండల కేంద్రంలోని దగ్గులవారి వీధిలో మండల వైసిపి అధ్యక్షుడు సింగారెడ్డి పోలిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిములపు సురేష్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి బుక్‌లెట్లు అందజేసి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మీ, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, మాజీ ఎంపిపి ఆళ్ళ ఆంజనేయరెడ్డి, జిల్లా గ్రంధాలయం చైర్మన్ రాచగొర్ల వెంకట సుశీల, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'వినూత్న'కు సివిల్స్‌లో 462 ర్యాంకు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వినూత్న

యుపిఎస్‌సి విడుదల చేసిన ఫలితాలలో బొల్లిపల్లి వినూత్న ఆలిండియా స్థాయిలో 462 ర్యాంకు సాధించి ఐఎస్‌గా ఎన్నికయ్యారు. బొల్లిపల్లి వినూత్న ప్రాథమిక విద్యాభ్యాసం ఒంగోలు శివానీ పబ్లిక్ స్కూలులో సాగింది. ఆమె ఇంటర్మీడియట్ విద్యను విజయవాడ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో అభ్యసించారు. బిటెక్ ఇంజినీరింగ్ విద్యను బెంగళూరులోని అమృత ఇంజినీరింగ్ కళాశాలలో చేశారు. న్యూఢిల్లీలోని లక్ష్యయ ఐఎఎస్ అకాడమీలో సివిల్స్ శిక్షణ పొందారు. ఆరో ప్రయత్నంలో వినూత్న ఐఎఎస్‌గా ఎన్నికయ్యారు. వినూత్న తండ్రి గతంలో ప్రకాశం జిల్లా స్టెప్ సిఇఒగా, ప్రస్తుతం నాగులుప్పలపాడు మండలం చదలవాడ పశుక్షేత్రం సంయుక్త సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. వినూత్న తల్లి సుభాషిణి వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్నారు. ఐఎఎస్‌గా ఎన్నికైన బొల్లిపల్లి వినూత్నను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

పరిశీలన తర్వాతే పనులు మంజూరు

ప్రజాశక్తి-వెలిగండ్ల

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పనుల క్రింద చేపట్టాల్సిన పనుల ప్రదేశాన్ని పరిశీలించిన తర్వాతే పనులు మంజూరు చేస్తామని మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్ అన్నారు. మండలంలోని కొట్టాలపల్లి, నాగిరెడ్డిపల్లి, కంకణంపాడు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్, ఎంపిడిఒ టి.సుకుమార్, ఉపాధి సిబ్బంది మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అనువైన చోట పనులు గుర్తిస్తే ఆ పనులు గ్రామానికి ఉపయోగపడతాయన్నారు. మూడు పంచాయితీల్లో 22 పనులను గుర్తించగా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో టిఎ మనోహర్, ఆదినారాయణ, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జునను మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. పశ్చిమ ప్రకాశంలోని రైతులు తగినన్ని శీతల గిడ్డంగులు అందుబాటులో లేక పండించిన మిర్చిని గుంటూరు వైపు తరలించుకోవాల్సి వస్తోందన్నారు. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆగిన శీతల గిడ్డంగి పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు.

న్యాయం జరగలేదంటూ...

ఆమరణ నిరాహారదీక్ష

ప్రజాశక్తి-మార్కాపురం

యర్రగొండపాలెంలో వ్యాపారి అచ్యుత ఆదినారాయణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ కేసులో తమకు న్యాయం జరగలేదంటూ ఆదినారాయణ కుటుంబీకులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుకున్నారు. తన భర్త ఆదినారాయణను హత్య చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, నిందితులంతా అధికార పార్టీ అండగా బహిరంగంగా తిరుగుతున్నారని సుజాత వాపోయారు. తన భర్తను హతమార్చిన అగంతకుల నుంచి తమకు ప్రాణహాని ఉందని వెల్లడించింది. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో తాము కూడా ఇక్కడే తుదిశ్వాస విడుస్తామని, అందుకే ఆమరణ నిరాహారదీక్షకు దిగామన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

సమస్యల పరిష్కార వేదిక

'గడపగడపకూ..': ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలోని రెండవ వార్డులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి తలుపు తట్టడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, సమస్యలు తెలుసుకోవడం జరుగుతోందన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్హత ఉండి సాంకేతిక లోపంతో సంక్షేమ అందనికి వారికీ కొంతమేర న్యాయం జరిగిందన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఆ వార్డు వైసిపి ఇన్‌చార్జి పివి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్

పాఠశాలల్లో నాడు- నేడు పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారుల అభివృద్ధి కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు - నేడు పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను జూన్ 12 లోపు పూర్తి చేయాలన్నారు. మండల ఇంజినీర్లు, ఎంఈఓలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని తెలిపారు. మురికి కాల్వలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, ఫ్రైడే -డ్రైడే కార్యక్రమంలో భాగంగా నెలలో మొదటి, మూడవ శుక్రవారాలలో నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఎన్‌డబ్ల్యుపిసి షెడ్యూలులో వర్క్ ఫిట్స్ ఎన్ని ఉన్నాయో వాటి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి సంబంధించిన ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రతిపాదనలను వెంటనే పంపించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు కచ్చితంగా వేయాలని కలెక్టర్ తెలిపారు. సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈకెవైసి పూర్తి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఐసిడిఎస్., వైద్య ఆరోగ్య శాఖ, హౌసింగ్ వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. సమావేశంలో సిపిఒ డి.వెంకటేశ్వర్లు, డిపిఒ జివి నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కె. శీనారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ బి.బాబూరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ. మర్దన్ అలీ, డిఇఒ పి. రమేష్ జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారిణి ఉషారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూసేకరణ ప్రక్రియలో పెండింగ్ క్లెయిమ్స్‌ను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లా నుంచి వెళుతున్న రహదారులు, రైల్వే మార్గాల విస్తరణకు భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో పురోగతిపై సంబంధిత అధికారులతో మంగళవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 216, 565, 544(డి), 167(బి) జాతీయ రహదారులు, గూడూరు - విజయవాడ రైల్వే మార్గం ట్రిప్లింగ్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గ విస్తరణ, రాష్ట్ర రహదారులకు భూసేకరణపై చర్చించారు. పెండింగ్ క్లెయిమ్స్, ప్రతిపాదనలు, పరిహార చెల్లింపు విధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు, నిర్వాసితుల బ్యాంకు ఖాతాలు- ఆధార్ కార్డుల అనుసంధానం తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ ఐపిఎస్ అధికారిణి అంకితా సురానా, డిఆర్ఒ ఆర్. శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, విజయ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, గ్లోరియా, రైల్వే, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధులు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్లే జగనన్న సైన్యం

మంత్రి సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం


వాలంటీర్లకు పురస్కారం అందజేస్తున్న మంత్రి సురేష్

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు, సారథులుగా పనిచేస్తున్న వాలంటీర్లే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిజమైన సేవా సైన్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. త్రిపురాంతకంలో మంగళవారం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ వలంటీర్లకు వందనం అనే పదం చాలా గొప్పదన్నారు. అంతటి స్థాయిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లకు అందించారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, మాజీ ఎంపిపి ఆళ్ళ ఆంజనేయరెడ్డి, జిల్లా గ్రంథాలయం చైర్మన్ రాచగొర్ల వెంకట సుశీల, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు,వాలంటీర్లు పాల్గొన్నారు.

మార్కాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ఆలోచన ప్రజలకు ప్రయోజనాలను చేకూర్చిందని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వాలంటీర్ల సత్కార సభలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కమిషనర్ బిఎస్ గిరికుమార్ అధ్యక్షతన జరిగిన సత్కార సభలో మున్సిపల్ చైర్పన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాస్, 1వ వార్డు కౌన్సిలర్ మారంరెడ్డి పుష్పలత రామక్రిష్ణారెడ్డి, 2వ వార్డు ఇన్‌చార్జి పివి నాయుడు, 3వ వార్డు ఇన్‌చార్జి అంబడిపూడి వంశీ, కౌన్సిలర్లు దొడ్డా భాగ్యలక్ష్మి, మొఘల్ సిరాజుత్‌ఉల్లాబేగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు పొందిన వాలంటీర్లను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందించారు.

మార్కాపురంలో వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి